# దిగుమతి చేసిన వచనగీతాలు

శ్రీ శ్రీ

## నేపథ్య సంగీతం

గోరుచుట్టు ప్రాణాంతకం.

అంతకన్నా ప్రాణాంతకం బాధతీరా అరవలేకపోవడం.

హాస్టేల్లో ఉన్నాను. అటూఇటూ గదుల్లో మనుష్యులు నిద్రపోతున్నారు. రాత్రి పెరుగుతోంది.

అరవడం ఎలా?

అందుకని ఓ తమాషా చేశాను. నా మెదడు వొలిచి పిపాల్లాంటి బాజాలూ, పాపాల్లాంటి బాకాలూ పైకి తీశాను. నా జ్వరంవల్ల రెండింతలైన శక్తితో వాటిలోంచి ఇల్లెగరగొట్టే సంగీతం పెల్లగించాను.

ఆ చప్పుడులో నా అరుపులు
వినబడవుగా!

ఇప్పుడు గొప్పగా అరుస్తున్నాను.

ఇప్పుడు నొప్పి కొంచెం తగ్గింది.

## సృష్టి

రొట్టెముక్కతో చిన్న జంతువును చేశాను.

ఎలకనుకుంటాను

ఔను. ఎలకే! చిట్టెలుక!

రెండుకాళ్లు పూర్తిచేశాను.

మూడో కాలికి పాదం తయారుచేసేలోపుగా చిట్టెలుక చీకట్లోకి పారిపోయింది.

## ఇంద్రజాలం

"కాఫీ తే!"

సెర్వర్ వెళ్ళాడు.

చాలామంది తింటున్నారు. నా సరదా
పోరాటం.

"ఏమండోయ్, బాగున్నారా?" అని నేను పలకరించను. కిందిదవడ పగలగొట్టడం నా కుశల ప్రశ్న.

అదుగో, మీసాల ఆసామీ!

"ఏమండోయ్, బాగున్నారా?"

ఆసామీ దవడ అతికించుకుంటున్నాడు.

మీదపడ్డాను. ఓకుమ్ము, ఓగుమ్కా, ఓగలీతా!

మొగ్గలేస్తూ మీదికెగిరాడు.

నిచ్చెనపట్టి కిందికి దించాను.

బండమీద ఉతికేను, పిండిపిండిగా పిసికేను, బల్లమీద పరిచేను.

ఇంకా బతికే ఉన్నాడు.

వీల్లేదు. వీడి అంతుచూడాలి. ఒక్కచూపుతో వీడి మొత్తం కూడిక చేశాను. నన్ను నాలుగుతో హెచ్చవేసుకున్నాను. కొట్టేశాను.

అరే! మళ్ళీనిలబడ్డాడు! రెచ్చిపోయాను.

వీడితల వెయ్యిచెక్కలు చెయ్యవలసిందే.

విసిరాను చెయ్యి!

సెర్వర్ తెచ్చిన కాఫీగ్లాసు ముక్కముక్కలయింది.

## నామీద ఫిర్యాదు

నేను చెప్పినప్రకారం చెయ్యనట.

ఏం చెయ్యను?

దారుల కూడలిదగ్గర రాటుబల్ల మీ ఊరు ఎటుందో చెబుతుంది. కాని తానే ఆ ఊరు వెళ్లదు.

## జబ్బుమనిషికి సలహా

జబ్బుమనిషి ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదు. మిత్రులతో మాట్లాడినా ఎక్కువ వాగివాగి అలిసిపోతాడు కాబట్టి నర్సు తెచ్చిన మందు తాగడానికికూడా నీరసపడిపోతాడు.

అందుచేత జబ్బుమనిషి తనమిత్రులను తానే

సృష్టించుకోవడం మంచిది. వాళ్లుపక్కనుంటే డాక్టరువచ్చినా ధైర్యంపోదు.

దుప్పటీమడతల్లో చాలామంది స్నేహితులను దాచడానికి వీలుంది. వాళ్ళసైజు ఎక్కువైతే తగ్గించుకోవచ్చు. ఆకారం మాత్రమే ప్రధానం.

ఒకసారినాకు జబ్బుచేసినప్పుడు తొలిరోజు పారిజాతపు పువ్వులు పెంచాను. దుప్పట్లన్నీ పారిజాతాలతో నిండిపోయాయి.

"పారిజాతపు పువ్వుల్లారా! పాటలు పాడండి" అన్నాను. అసలేఅవి గజగజ వొణికిపోతున్నాయి, ఆసుపత్రిలోకి వచ్చినందుకు! నా మొగం, ఇక అవేం పాడుతాయి?

"పారిజాతపు పువ్వుల్లారా! పారిపొండి" అన్నాను.

ఈసారి వాటిస్థానే ఏనుగుల్ని రమ్మన్నాను. (చిన్నసైజు) అవి తీరుబాటుగా అటూ ఇటూ పచారుచేస్తూంటే నాకెంతో హాయిగా ఉంది. వాటి చిన్నకళ్లు నన్నర్థంచేసుకొని పలుకరిస్తే ఎంతబాగుంది, ఎంతబాగుంది!

కాని ఇంతట్లోకే అనుమానొచ్చింది. చెప్పొద్దూ, నేను ఉత్త సోమరిపోతుని. కళ్లుమూసుకొని అటు తిరిగిపోయాను. "దుప్పట్లోకొచ్చి తొండాలను గురించి ఉపన్యాసం ఇవ్వండి. ఊగొడుతూ పడుక్కుంటాను" అన్నాను.

ఏనుగులెక్కడేనా మాట్లాడతాయా? అవి ఉపన్యసించలేవు.

కాని ఏ ఉపన్యాసం చెయ్యకపోయినా ఏనుగులు నిన్నుకాపాడుతూ ఉంటే ఎంత ధైర్యంగా ఉంటుంది!

నిశ్చింతగా నిద్రపోయాను.

(ఫ్రెంచికవి ఆన్రీ మీషో రచించిన "అంతరంగంలోని ఆకాశం"నుంచి, కొంచెం మార్పుతో)

# క్షేత్రయ్య పదాభినయసమితి ఉత్సవాలు

క్షేత్రయ్య పదాభినయ ప్రచారసమితి ప్రథమ వార్షికోత్సవాలు విశాఖపట్టణపురమందిరంలో అక్టోబరు 24, 25 తేదీలలో జరిగాయి. ఆ సందర్భంలో శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు మాట్లాడుతూ కూచిపూడి నృత్యవిద్యయొక్క విశిష్ఠత అభినయంలో స్ఫురిస్తుందనీ క్షేత్రయ్యపదాలు అందుకు తగినవనీ అన్నారు. సమితి చేస్తున్న కృషిని శ్రీ నటరాజ రామకృష్ణగారి నటనాకౌశల్యాన్నీ ప్రశంసించారు.

శ్రీ ఇ. కృష్ణయ్యర్ ప్రసంగిస్తూ ఏ నృత్యప్రదర్శనమైనా అభినయంలేనిదే సంపూర్ణం కాదు అన్నారు. అభినయంలో శ్రీ నటరాజ రామకృష్ణగారు చూపగల్గిన ప్రౌఢమైన పోకడలను కొనియాడారు.

రెండవరోజున ఆంధ్రరాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి సమక్షమున డాక్టర్ వెంకటకృష్ణారావుగారి కుమార్తెలు ఉమ, సుమతీ, శ్రీ సాగి బాపిరాజుగారి పుత్రుడు రాజన్‌కుమార్ గార్ల ప్రథమ నృత్యప్రదర్శనం జరిగింది. క్షేత్రయ్యపదాభినయ ప్రచార సమితి అధ్యక్షులు శ్రీ విస్సా అప్పారావుగారు మంత్రిగారికి స్వాగత పత్రము సమర్పించారు.

నృత్యనాటికతో ప్రారంభమైనది. రాజన్‌కుమార్ తాండవనృత్యము ఉమ చేసిన లాస్యనృత్యము, రంగస్థలమునకు నూతన వికాసము కల్గించినవి. కుమారి సుమతి నారాయణతీర్థులువారి "నీలమేఘశరీర" అనే తరంగం ప్రదర్శించినప్పుడు ఆమె వివిధ గతులు, అపూర్వమైన అడుగులు సుమారు ముప్ఫయికిపైగా చూపించి ప్రేక్షకులను ముగ్ధులను గావించినది. చాలా అడుగులు ప్రచారములో లేనివి. కష్టతరమైనవి. ఆమె అతి కౌశల్యముతో చూపించినప్పుడు పొందిన ఆనందమునకు మేర లేదు. కుమారి ఉమ నిత్యాకల్యాణి అనే రాగమాలికా కీర్తనచేసి, హస్త, పదాన్యాసము ప్రదర్శించినది. రాజన్‌కుమార్ చేసిన మండూకభరతము శ్రీ విజయనగర సంస్థానాధీశులు శ్రీ పూసపాటి ఆనంద గజపతి మహారాజుగారి కంకితమివ్వబడియుండెను. ఈ ప్రాంతములో యింత కష్టతరమైన నృత్యరీతులు యిదివరలో ప్రదర్శింపబడలేదు. హిందూస్థానీ భైరవిరాగిణీ నృత్యస్వరూపం కుమారి సుమతి చేసి ప్రేక్షకులను జోకొట్టినది. శ్రీ కృష్ణయ్యరుగారు నర్తకీ నర్తకులను ప్రశంసించుతూ, స్వల్పకాలము అమోఘమైన శిక్షణ [illegible]